# నాన్న డైరీ

ఆ సాయంత్రంపూట బీచ్‌లో కూర్చున్న శ్రీకాంత్‌కి మనసు మనసులో లేదు. పిల్లలు ఇసుకలో పిచ్చుకగూళ్ళు కడుతూ ఉల్లాసంగా అరుస్తున్నారు. ఆకాశంలో రంగురంగుల పక్షుల గుంపు బారులుగా సాగిపోతోంది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉన్నా శ్రీకాంత్ మనసులో మాత్రం సంతోషం లేదు. ఎదురుగా అనురాధ ఇసుకలో సున్నాలు చుడుతూ తలొంచుకుని కూర్చుంది. సంవత్సర కాలంగా ఇద్దరికీ పరిమితులు దాటని స్నేహం.

క్రొత్తగా ప్రారంభమైన మల్టీనేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇద్దరూ అప్రంటీస్ మేనేజర్లుగా చేరారు. ఆ ప్రాజక్టు ఇప్పుడు స్థిరపడింది. అలా వారి ఉద్యోగాలు నిలకడ అయ్యాయి. సంవత్సరం నుంచీ తీరిక లేకుండా పని చేసిన ఆ ఇద్దరికీ ఇప్పుడు తీరిక లభించింది. ఇంత వరకూ వారి మధ్యకు రాని ఒక క్రొత్త విషయం చెప్పేందుకు శ్రీకాంత్ ఆమెనున బీచ్‌కు పిలిచాడు. అది ప్రేమ ప్రపోజల్... అయితే ఆమె వెంటనే ఆ ప్రతిపాదన త్రోసిపుచ్చింది. అతనికి ఆ విషయం షాక్‌గా అనిపించింది.

“మనం స్నేహితులుగా ఉందాం...” అన్న ఆమె మాటలు అతనికి ఆశనిపాతంలా అనిపించాయి. “ఈ ప్రేమ ప్రపోజల్ పెళ్ళి చేసుకోవడానికే కదా...” అన్నాడతను. ఆమె మాట్లాడకుండా మౌనంగా ఊరుకుంది. ఆమె తిరస్కారం అతడిలో ఆలోచన రేపింది.

తను ఆమె వ్యక్తిత్వంలో ఎదిగాడు. తనకు ఓర్పు తక్కువ. ఆమె సహనశీలి. తను ఎవరైనా ఏదైనా అంటే రియాక్టవుతాడు. ఆమె కూల్‌గా ఉంటుంది. అది ఆమెనుంచి నేర్చుకున్నాడు. ఆమె ఎవరికి ఏ సహాయం కావాలన్నా ఏ ప్రతిఫలాపేక్ష లేకుండా చేస్తుంది. ఆమె జన్మదినాన్ని, ఓల్డేజ్ హెూమ్‌లోనో, అనాథశరణాలయంలోనో జరుపుకొనేది... తను ఆమె పద్ధతినే

అనుసరిస్తున్నాడు. తను స్మోక్ చేసేవాడు. తన పుట్టినరోజునాడు ఆమె తనకు బహుమతిగా ఇచ్చిన పుస్తకం "హౌటు స్టాప్ స్మోకింగ్." అలా ఆమె తనకో రోల్ మోడల్ అయింది. అలాంటి ఆమె తన జీవితంలోకి వస్తే బావుంటుంది అనుకున్నాడు. మరి తను తన ప్రపోజల్‌ని వెంటనే కాదంది కారణం ఏమిటో?!

పావుగంట నుంచీ ఇద్దరి మధ్యా మౌనం రాజ్యమేలుతోంది.

"ఇక ఎంతసేపు ఇలా?" అతను లేచాడు.

"సరే నేనూ బయలుదేరుతాను" అంటూ అనూరాధ తన స్కూటీ వైపు కదిలింది. శ్రీకాంత్ అడుగులు భారంగా పడుతున్నాయి.

వెళుతున్న అనూరాధ వంక చూస్తూ తన బైక్‌వైపు నడిచాడు.

* * *

అదొక సాఫ్ట్‌వేర్ కంపెనీ. ఉదయం తొమ్మిది గంటలయ్యింది. రాత్రి షిఫ్ట్‌లో పని చేసినవాళ్ళు వెళ్ళిపోతుంటే డే షిఫ్టు వాళ్ళు గబగబా ఆఫీసు మెట్లెక్కుతున్నారు. ఐదంతస్తుల ఆ కార్యాలయం ఆఖరి ఫ్లోర్‌లోని తన కేబిన్‌లోకి  నడిచాడు శ్రీకాంత్. తన సహ ఉద్యోగులంతా తమ తమ కేబిన్ లలో కూర్చోకుండా అందరూ ఒకేచోట చేరి కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఏమయ్యింది?" అడిగాడు శ్రీకాంత్.

"సెంట్రల్ సర్వర్ క్రేష్ అయ్యింది. సిస్టమ్స్ ఏమీ పనిచెయ్యవు. ఇంకో రెండుగంటలసేపు ఆటవిడుపు" అన్నాడొక సహచరుడు. వారిలో అనూరాధ లేకపోవడం చూసి మెల్లగా ఆమె కేబిన్‌లోకి నడిచాడు శ్రీకాంత్.

అనూరాధ తన కేబిన్‌లో కూర్చుని పుస్తకం చదువుకుంటోంది. ఆమె కేబిన్‌లోని క్యూబికల్ మీద అరడజను పాత డైరీలు. ఒక నిమిషంసేపు కన్నార్పకుండా ఆమె వంక చూసాడు. అందం ప్లస్ భావుకత. ముఖంలో ఏ

నైర్మల్యం. అందుకే ఆమె అంటే తనకు ఇష్టం! అనుకున్నాడు. ఆమె ఆ పుస్తకం చదువుతూ మధ్యమధ్యలో కళ్ళు తుడుచుకొంటోంది.

"ఏమిటి చదువుతున్నావ్?" అన్నాడు.

"నాన్న డైరీ" అంది.

"నాన్న డైరీయా" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవును ఇవన్నీ నాన్న రాసిన డైరీలు. నా బర్త్ సర్టిఫికెట్ కోసం వెతుకుతుంటే కనిపించాయి. యథాలాపంగా తిరగేస్తుంటే, చాలా విషయాలు తెలీనివి తెలిసాయి. నాన్న, అమ్మ ఊరెళ్ళారు.... వారం దాకా రారు. మొత్తానికి వారంనుంచీ చదువుతున్నాను" అంది అనూరాధ.

"పర్సనల్ కదా చదవచ్చా" అన్నాడు.

"నువ్వు చదవొచ్చు. తప్పనిసరిగా నువ్వూ చదవాలి" అంటూ ఒక డైరీ అందించింది. మధ్యలో మడతపెట్టిన పేజీలు.

1988, మే రెండు

సీత కన్సీవ్ అయింది. మాది మేసరిక వివాహం. కాబట్టి డాక్టరు స్కేనింగ్ చేయించమన్నాడు. బిడ్డ ఏదైనా వంశానుగత అవలక్షణాలతో పుడుతుందేమోనని భయం. అందుకే డాక్టరు చెప్పాడు. మొదటి కాన్పు కదా జాగ్రత్తలు తీసుకోవాలి అని.

1988 ఆగస్టు నాలుగు

స్కేనింగ్ రిపోర్ట్ వచ్చింది. ఆడపిల్ల. అమ్మ నాన్న సన్నిహితులూ అందరిదీ ఒకటే మాట. నీది చిరుద్యోగం. నీమీద ఆధారపడిన ముసలి తల్లిదండ్రులు, తోబుట్టువులు. అప్పుడే ఎందుకు? కొంత కాలం ఆగితే సరి. పైగా ఆడపిల్ల!! మగపిల్లాడయితే ఓకే. అందుకే అబార్షన్ చేయించు అన్నారు. అమ్మో.... ఒక శిశువును ఈ భూమ్మీదకు రాకుండా చెయ్యడమా!

డైరీ చదవడం ఆపుచేసి అనూరాధ వంక చూసాడు శ్రీకాంత్.

"మీ నాన్నగారి ఆత్మ కనిపిస్తోంది దీంట్లో, మీ అమ్మగారిదీ నాన్నదీ మేనరికమా..." అన్నాడు.

"ఔను తాతగారు చనిపోతే నాన్నకు ఉద్యోగం వచ్చింది. వాస్తవానికి అత్తయ్య నాన్నకన్నా పెద్దది. ఆవిడకు రావాలి ఉద్యోగం.... అయినా నాన్న కోసం ఆ ఉద్యోగం వదలుకొంది. అందుకే నాన్న అత్తయ్య కూతురుని పెళ్ళి చేసుకొని తన రుణం తీర్చుకున్నాడు. ఇదిగో ఈ డైరీలో పేజీలు చదువు" అంటూ ఇంకో డైరీ అందించింది అనూరాధ.

1989 జనవరి, 5

నూతన సంవత్సర కానుక, తెల్లని కాంతిపుంజంలాంటి పాపాయి ఈ భూమ్మీదకొచ్చింది. ఈ పసికందునా, భూమ్మీదకు రానివ్వకూడదని సలహా ఇచ్చింది బంధువర్గమంతా కలసి ఆడపిల్ల, అన్నీ ఖర్చులే! తలకురాసే నూనె ఖర్చు పౌడర్లు స్నోలు, పిల్ల పెద్దదయితే ఖర్చు, పెళ్ళీడుకొస్తే ఖర్చు పెళ్ళి చేసి అత్తారింటికి పంపితే ఖర్చు రెండు పురుళ్ళు నువ్వే పొయ్యాలి. ఆ తరువాత మనవళ్ళను నువ్వే సాకాలి. ఇలా నన్ను ఊదరగొట్టేశారు. మరి ఆమె జగజ్జనని ఆదిశక్తి ఆ మాటమరుస్తారేం. అమ్మ అయినా, అక్క అయినా, కూతురైనా.... స్త్రీ ఏ పాత్రలో ఉన్నా మాతృమూర్తిగా మరో పాత్రపోషించగల ఔదార్యం ఒక్క స్త్రీ మూర్తిదే! అలాంటి ఆమెనే ఈ భూమ్మీదకు రాకుండా చేద్దామను కున్నారా! ఆ మనుషులకు ఈ నెలల పసికందు బోసినవ్వే సమాధానమేమో!

1991 డిశంబరు, 30

విశాఖపట్నం ఏజన్సీ ఏరియాలో కంపెనీ కొత్త ప్రాజెక్టు. అక్కడ మూడేళ్ళు పనిచేస్తే పదోన్నతి. ఎవరూ వెళ్ళడానికి ఇష్టపడడంలేదు. నేను పేరిచ్చాను. నా కూతురు బంగారు భవిష్యత్తు కోసం. పాపకూ సీతకూ తోడుగా అమ్మ, నాన్న, తమ్ముడూ చెల్లాయీ ఉంటారు కదా!"

చదవడం ఆపి అనూరాధ వంక చూసాడు శ్రీకాంత్ ఆ చూపుల్లో సంతృప్తి కనిపించింది. మరో డైరీ తెరిచాడతడు.

2000 మార్చి, 7

అనూరాధ వ్యక్తురాలయింది. అమ్మా, నాన్న భారీగా చెయ్యాలన్నారు నాకు ఎందుకో ఇష్టం లేదు. వారికి మృదువుగా వివరించాను. అయినా అర్థం చేసుకోలేదు. 'పిల్ల పెద్దమనిషి అయితే ఫంక్షను చెయ్యలేని వాడివి రేపు పెళ్ళి ఎలా చేస్తావు?' అంటూ కోప్పడ్డారు.

ఒక ఆడపిల్ల శరీరంలో వయస్సు మార్పువల్ల సంభవించే సహజ ప్రకృతి చర్యకు ఇంత హడావుడి అవసరమా? ఈ ఖర్చు ఆమె చదువుకు ఉపయోగిస్తా నంటే నన్ను అందరూ విమర్శిస్తారెందుకు?

పాపను కూర్చోబెట్టి చెప్పాను. ‘‘జాగ్రత్త తల్లీ భవిష్యత్తులో నిన్ను నిరంతరం వెంటాడే చూపుల నుంచి వాంఛల బాణాలనుంచి తప్పించుకుంటూ జీవితాన్ని ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగించు’’ అని చెప్పాను. ఆ సమయంలో ప్రతీ ఆడపిల్లకు తల్లితండ్రులు చెప్పాల్సినవి ఇవే కదా! పందమందిని పిలిచి విందులు చేసి ప్రచారం చెయ్యడం అవసరమా! నా దృక్పథంతో ఎవరైనా ఏకీభవిస్తారా?

2002 ఏప్రియల్, 7

ఆఫీసులోనూ, ఇంటా బయట నా కొచ్చిన పేరు 'మైసర్'... అంటే పిసినారి. ఎవరికీ అప్పులివ్వను. ఎవరిదగ్గరా అప్పు తీసుకోను. ఒక్క రూపాయి ఖర్చు పెట్టడానికి బాగా ఆలోచిస్తాను. ఒక్క సంతానంతో కుటుంబ నియంత్రణ ఆపరేషను చేయించుకొన్నాను. పైగా ఆ సంతానం ఆడపిల్ల. ఒక కొడుకు కోసం చూడకపోయావా? మరీ అంత తొందర పడ్డావేం? ఆడపిల్ల అంటే ఆ....డ పిల్ల! నిన్ను పున్నామ నరకం నుంచి తప్పించేది పుత్రుడే కదా

అన్నారు అందరూ నేను పున్నామనరకం నుంచి తప్పించు కోవడం కాదు. నా కూతురి జీవితం స్వర్గతుల్యం చెయ్యాలి. అందుకు ఎవరు ఏమన్నా బాధపడను. 2010 కల్లా పాప చదువు పూర్తవుతుంది. ఆడపిల్ల తన కాళ్ళమీద తను నిలబడాలి. అందుకు సరిపడా చదువు చదివిస్తాను. ఉద్యోగస్తురాలైన తర్వాత పెళ్ళి చేస్తాను. కాలికి బలపం కట్టుకుని సంబంధాలకోసం తిరుగు తాను. నా బంగారుతల్లి సుఖపడేలా అటు ఏడు తరాలు. ఇటు ఏడు తరాలు చూసి. ఒక అయ్య చేతిలో పెడతాను.

నాకు ఆస్తిపాస్తులు లేవు. పెద్ద ఉద్యోగం కాదు. అయినా భయం లేదు. సిరివెన్నెలగారు చెప్పినట్టు దేహముంది. ప్రాణముంది, సత్తువుంది నెత్తురుంది, అంతకన్న సైన్యముండునా?''

శ్రీకాంత్ డైరీ చదవడం ఆపు చేసాడు. పక్కనే తనతోపాటు డైరీ చదువుతున్న అనూరాధ కళ్ళనుంచి ధారాపాతంగా కన్నీరు. అతనూ దుఃఖాన్ని ఆపుకోలేక పోయాడు. నిమిషం తర్వాత ఆమెతో అన్నాడు.

''ఇవి అక్షరాలు కావు. మీ నాన్నగారి గుండెచప్పుడు. నువ్వు నా ప్రపోజల్‌ని ఎందుకు వద్దన్నావో అర్థమయింది అయినా'' అతను ఒక్క క్షణం ఆగి చెప్పడం మొదలుపెట్టాడు.

''అంత గొప్ప తండ్రికి కూతురైన నిన్ను వదులుకోలేను.... ఆయన వెదకబోయే పెళ్ళికొడుకుల జాబితాలో నేనూ ఉంటాను.... అది నీ ద్వారా కాదు.... నేనూ గొప్పగా భావించే నా తల్లిదండ్రులద్వారా....'' అలా అంటూ శ్రీకాంత్ ముందుకు కదిలాడు, తన చేతిలోని డైరీ అనూరాధకిస్తూ ఆమె ఆ డైరీని తన గుండెలకు హత్తుకుంటూ వెళ్ళిపోతున్న శ్రీకాంత్ వంక ఆత్మీయంగా చూస్తూ వుండిపోయింది.

*(స్వప్నమాస పత్రిక జులై 2012)*